Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699


# రాజధాని వార్తలు

RAJADHANIVARTALU


ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కాదే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 1 పేజీలు (Pages) : 4 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

మంగళవారం, 24 - 6 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 స్థాపితం : 2015

## అసెంబ్లీ ఉప ఎన్నికలో టీఎంసీ విజయకేతనం



**న్యూఢిల్లీ:** నాలుగు రాష్ట్రాల్లోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలకు జరిగిన ఉప ఎన్నికల్లో పశ్చిమబెంగాల్ నుంచి అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ మరోసారి సత్తా చాటుకుంది. ఎన్నికలు జరిగిన కలీగంజ్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థి అలిఫా అహ్మద్ 50,049 ఓట్ల భారీ ఆధిక్యంతో గెలిచారు. ఆమెకు 1,02,759 ఓట్లు పోలయ్యాయి. ఆమె సమీప ప్రత్యర్థి, బీజేపీ నేత ఆశిష్ ఘోష్‌కు 52,710 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కబిలుద్దీన్ షేక్ 28,348 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. ఉప ఎన్నికల్లో టీఎంసీ 55 శాతం ఓటింగ్ షేర్ పొందగా, బీజేపీ 28 శాతం, కాంగ్రెస్ 15 శాతం ఓటింగ్ షేర్ పొందాయి. కలీగంజ్ సీటు తిరిగి గెలుచుకుంటామని టీఎంసీ మొదట్నించీ ధీమాతో ఉండగా, ఈ నియోజకవర్గంలో 48 శాతం మైనా రిటీ ఓట్లు ఉండటంతో బీజేపీ ప్రధానంగా హిందూ ఓట్లపైనే ఫోకస్ చేసి ప్రచారం సాగించింది. ఇటీవల కేంద్రం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'ను ప్రధానంగా ప్రస్తావించింది. టీఎంసీ బుజ్జగింపు రాజ కీయాలపై విమర్శలు గుప్పించింది.

**గెలుపుపై మమత స్పందన**

కలీగంజ్‌లో టీఎంసీ అభ్యర్థి గెలుపొందడంపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కుల, మతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు టీఎంసీ అభ్యర్థిని గెలిపించారని, వారందరికీ తాను కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని అన్నారు. ఈ విజయాన్ని బెంగాల్‌కు, బెంగాల్ ప్రజలకు అంకితమిస్తున్నా నని అన్నారు. కలీగంజ్ సిటింగ్ టీఎంసీ ఎమ్మెల్యే నసిరుద్దీన్ అహ్మద్ గత ఫిబ్రవరిలో కన్నుమూయడంతో ఆయను కుమార్తె అలిఫా అహ్మద్‌కు ఉప ఎన్నికల్లో టీఎంసీ టిక్కెట్ ఇచ్చింది. గత గురువారం నాడు ఎన్నికలు జరుగగా, 69.85 శాతం పోలింగ్ జరిగింది.

## ఎయిర్ ఇండియా విమానం గాలిలో ఉండగా సాంకేతిక లోపం

**న్యూఢిల్లీ:** ఎయిర్ ఇండియా విమానాలకు సాంకేతిక సమస్యలు తప్పడం లేదు. తాజాగా మరో ఎయిర్ ఇండియా విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. ఢిల్లీ టూ జమ్మూ ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్‌కు సోమవారంనాడు ఈ పరిస్థితి తలెత్తింది. ఐఎక్స్ 2564 విమానం ఢిల్లీ నుంచి జమ్మూకు బయలుదేరిన కొద్ది సేపటికే విమా నంలో సాంకేతిత లోపం గుర్తించారు. దీంతో విమానాన్ని తిరిగి ఢిల్లీకి మళ్లించారు. ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ ప్రతినిధి ఒకరు ఈ విషయాన్ని ధ్రువీకరించారు. సాంకేతిక లోపం కారణంగా ఢిల్లీ విమానం వెనక్కి రావడంతో ప్రత్యామ్నాయంగా జమ్మూకు మరో విమానాన్ని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. దీనికిముందు, ఆదివారం నాడు తిరువనంతపురం నుంచి ఢిల్లీ వెళ్లాల్సిన ఎయిర్ ఇండియా విమానం రద్దు చేశారు. తిరువనంతపురంలో విమానం ల్యాండింగ్ కాగానే తనిఖీలు చేపట్టగా పక్షి




ఢీకొట్టినట్టు గుర్తించారు. దీంతో ఢిల్లీకి షెడ్యూల్డ్ ప్రయాణాన్ని రద్దు చేశారు. కాగా, మూడు రూట్లులో ఎయిర్ ఇండియా సర్వీసులను రద్దు చేయడంతో పాటు 118 వీక్లీ ఫ్లైట్లను 19 రూట్లలో తాత్కాలికంగా తగ్గించినట్టు ఎయిర్ ఇండియా ప్రకటించింది.

## అనుకున్న లక్ష్యాలను సాధించిన ఆపరేషన్ సిందూర్



**న్యూఢిల్లీ:** పహల్గాం ఉగ్రదాడికి ప్రతిగా మేలో భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ అన్ని లక్ష్యాలను సాధించిందని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. ఉగ్రవాదుల్లో భయం పుట్టించిందని, జాతీయ భద్రతపై భారతదేశానికి ఉన్న కృతనిశ్చ యాన్ని బలంగా చాటి చెప్పిందని అన్నారు. రాష్ట్రపతి భవన్ కాంప్లెక్స్‌లో సోమవారంనాడు జరిగిన ఒక కార్యక్రమాన్ని ఉద్దేశించి రాజ్‌నాథ్ సింగ్ ప్రసంగిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బాధ్యతలు చేపట్టిన రెండో సంవత్సరంలో (ఆగస్టు 2023 – జూలై 2024) చేసిన 51 ప్రసంగాలతో కూడిన 'వింగ్స్ టు అవర్ హోప్స్ –వాల్యూమ్ II' పుస్తకాన్ని ఈ కార్యక్రమంలో రాజ్‌నాథ్‌సింగ్ ఆవిష్క రించారు. దీనితోపాటు హిందీ వెర్షన్ 'Ashaon Ki Udaan - Khand 2'ను ఈ–వెర్షన్‌తో సహా ఈ కార్యక్రమంలో అధికారికంగా విడుదల చేశారు. ఈ వ్యాసాల సంకలనాన్ని రాష్ట్రపతి భవన్ చేపట్టగా, కేంద్ర సమాచార, ప్రసార శాఖ సారథ్యంలోని పబ్లికేషన్స్ డివిజన్ ప్రచురించింది.

**భారత భవిష్యత్తుకు డాక్యుమెంటు**

రాష్ట్రపతి ద్రౌపది ముర్మ నాయకత్వం, విజన్‌ను రాజ్‌నాథ్ సింగ్ ఈ సందర్భంగా ప్రశంసిస్తూ, ఈ పుస్తకం కేవలం ప్రసంగాల సంకలనం కాదని, భారత భవిష్యత్తును లిపిబద్ధం చేసే డాక్యుమెంట్ అని అన్నారు. గవర్నెన్స్, ఇన్‌క్ల్యూజివిటీ, జాతీయ ఆకాంక్షలను చాటి చెబుతోందని, 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యసాధనకు ఒక మార్గదర్శిగా నిలుస్తుందని చెప్పారు. భారతదేశ అభివృద్ధి ప్రయాణాన్ని ఆవిష్కరిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, సహాయ మంత్రి ఎల్ మురుగన్ పాల్గొన్నారు.

## జగన్‌కు రాజకీయ లబ్ధి తప్పా.. మనుషుల ప్రాణాలంటే లెక్క లేదా : అనిత

**అమరావతి, (రాజధాని వార్తలు):** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత సంచలన వ్యాఖ్యలు చేశారు. వైసీపీని చూస్తుంటే రాజకీ యాలు దిగజారిపోయాయన్న ఆవేదన కలుగుతోందని అన్నారు. జగన్‌కు మానవత్వం లేదు.. హింసను ప్రేరేపిస్తున్నారని మండిప డ్డారు. ఇవాళ (సోమవారం) ఏపీ సచివాలయంలో హోంమంత్రి అనిత మీడియా తో మాట్లాడారు. జగన్‌కు సత్తెనపల్లి పర్యటన సందర్భంగా జడ్‌ప్లస్ సెక్యూరిటీ కల్పించామని స్పష్టం చేశారు. పరామర్శకు వెళ్తూ జగన్ రోడ్‌షో చేశారని ధ్వజమెత్తారు. ఉదయం పదిన్నరకు తాడేపల్లి నుంచి బయల్దేరిన జగన్.. సాయంత్రం 4 గంటలకు రెంటపాళ్ల చేరుకున్నారని తెలిపారు. జగన్ కావాలనే బలప్రదర్శన చేసుకుంటూ వెళ్లారని చెప్పుకొ చ్చారు. జగన్ వాహనం కింద ఓ వ్యక్తి పడిన ఎందుకు పట్టిం చుకోలేదని ప్రశ్నించారు. దయ, జాలి లేకుండా అతడ్ని ముళ్ల పొదల్లో పడేశారని ఆవేదన వ్యక్తం చేశారు హోం మంత్రి అనిత.

**జగన్ రాజకీయ ముసుగులో ఉన్న నేరస్తుడు**

సింగయ్యను సమయానికి ఆస్పత్రికి తరలిస్తే బతికేవారని హోం మంత్రి అనిత అన్నారు. దళితుడు జగన్ కారు టైర్ కింద నలిగిపోయినా పట్టించుకోలేదని మండిపడ్డారు. జగన్‌కు రాజకీయ లబ్ధి తప్పించి మనుషుల ప్రాణాలంటే లెక్క లేదా అని ప్రశ్నించారు. జగన్ పర్యటనలో ఇద్దరు చనిపోయినా పర్యటన కొనసాగించారని ఫైర్ అయ్యారు. బెట్టింగ్‌లో అప్పులపాలై చనిపోయిన వ్యక్తికి విగ్రహం పెట్టించారని చెప్పుకొచ్చారు. తన పర్యటనలో ఇద్దరు చనిపోయినా జగన్ రెడ్డి ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. జగన్‌కు ఇంకా సీఎం కుర్చీలో కూర్చోవాలనే దురాశ ఉందని చెప్పారు. జగన్ వాహనం కిందపడే సింగయ్య నలిగిపోయినట్లు వీడియో ఉందని అన్నారు. సింగయ్య మృతిని వైసీపీ నేతలు నిస్సిగ్గుగా సమర్థిస్తున్నా రని.. చనిపోయింది తమ పార్టీ కార్యకర్తేగా అని కొంతమంది నేతలు అంటున్నారని తెలిపారు. జగన్ రాజకీయ ముసుగులో ఉన్న నేరస్థుడని ఆరోపించారు.

## జగన్.. మూడు ముక్కలాటతో ఏపీకి రాజధాని లేకుండా చేశారు : సీఎం చంద్రబాబు



**అమరావతి, (రాజధాని వార్తలు):** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మూడు ముక్కలాటతో ఏపీకి రాజధాని లేకుండా చేశారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ హయాంలో నిధులు మళ్లించి దుర్వినియోగం చేశారని మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వ విధానాలతో పెట్టుబడిదారుల్లో నమ్మకం పోయిందని చెప్పారు. కూటమి ప్రభుత్వంలో స్వర్ణాంధ్ర విజన్– 2047ను లక్ష్యంగా పెట్టుకున్నామని ఉద్ఘాటించారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తో అభివృద్ధి ఎలా ఉంటుందో చూపించామని చెప్పారు. అన్నీ చేసేశామని చెప్పట్లేదని.. ఊహించిన దానికంటే ఎక్కువగానే సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ఏపీలో అమలు చేశామని అన్నారు. సీఎం పదవి తనకు కొత్తకాదని నాలుగు సార్లు సీఎం అయ్యానని గుర్తుచేశారు. మూడు పార్టీలు కలిసి అధికారంలో ఉన్నా ఎలాంటి సమస్య రాలేదని చెప్పారు. ఎన్ని ఇబ్బందులున్నా చెప్పిన మాట నిలబెట్టుకుంటామని ఉద్ఘాటించారు. సుపరిపాలన అందించేందుకు అధికారులు కూడా కలిసి రావాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన రాజధాని అమరావతిలోని సచివాలయం వెనుక భాగంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై "సుపరిపాలనలో తొలి అడుగు" పేరిట ఏడాది పాలనపై ఇవాళ(సోమవారం) సమీక్ష సమావేశం నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసి ఈ సదస్సును చంద్రబాబు, పవన్ కల్యాణ్, పురంధరేశ్వరి, లోకేష్ ప్రారంభించారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీఎస్, ఉన్నతాధికారులు, హెచ్‌వోడీలు, జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు, డైరెక్టర్లు హాజరయ్యారు. ఈ సమావేశంలో ఏడాదిలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఆ తర్వాత రెండో ఏడాది లక్ష్యాలపై సమావేశంలో మాట్లాడారు. అధికార యంత్రాంగం, ప్రజా ప్రతినిధులతో తొలిసారి భిన్నంగా ఈ సమావేశం నిర్వహించారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మూడు రాజధానుల ప్రకటనతో ఏపీ అభివృద్ధి కుంటుపడిందని సీఎం చంద్రబాబు అన్నారు. పోలవరం పూర్తయితే ఏపీకి నీటి సమస్య సమసిపోతుందని వెల్లడించారు. వైసీపీ హయాంలో నిధులు మళ్లించి దుర్వినియోగం చేశారని మండిపడ్డారు. అధికారంలోకి రాగానే నాలుగు సంతకాలు పెట్టానని గుర్తు చేశారు. మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చామని ప్రకటించారు. వైసీపీ హయాంలో రెవెన్యూ రికార్డులను అస్తవ్యస్థం చేశారని ఆరోపించారు. 213 అన్న క్యాంటీన్ల ద్వారా రూ.5కే భోజనం పెడుతున్నామని ఉద్ఘాటించారు. విశాఖ ఉక్కు పరిశ్రమకు రూ. 11,400 కోట్లు సాయం చేశామని చెప్పారు. అమరావతిని మళ్లీ పట్టాలెక్కించాం.. పూర్తి చేస్తామని మాటిచ్చారు. పోలవరం ప్రాజెక్ట్‌కు రూ.12,500 కోట్లను కేంద్ర ప్రభుత్వం కేటాయించిందని అన్నారు. విశాఖపట్నం రైల్వేజోన్ పనులు వేగంగా జరుగుతున్నాయని వివరించారు. తల్లికి వందనం హామీని పూర్తిగా నిలబెట్టుకున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## రంగుల పిచ్చితో మొత్తం విద్యావ్యవస్థను జగన్ నాశనం చేశారు : లోకేశ్

**అమరావతి, (రాజధాని వార్తలు):** సుపరిపాలనలో తొలి అడుగు వేశామని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. పాలనలో ప్రభుత్వ ఉద్యోగస్తుల సహకారం ఎంతో అవ సరమని చెప్పారు. ప్రభుత్వ అధికారులు కూడా ప్రజలకు మరింత దగ్గర అవ్వాలని సూచించారు. చాలా సమస్యలతో ప్రజలు అధికారుల దగ్గరకు వస్తారని.. వారిని ఆప్యాయంగా పలకరించి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని చెప్పారు. ఉద్యోగస్థులు తలుచుకుంటే స్వర్ణాంధ్ర ఖచ్చితంగా సాధ్యం అవుతుందని అన్నారు. గత వైసీపీ పాలకుల అహంకారం, అరాచకంతో 151సీట్లు 11కే పరిమితం అయ్యాయని.. ఈ విషయాన్ని కూటమి నేతలు గుర్తుపెట్టుకోవాలని సూచించారు. రంగుల పిచ్చితో మొత్తం విద్యావ్యవస్థను వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాశనం చేశారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'సుపరిపాలనలో తొలి అడుగు పేరిట' ఏడాది పాలనపై ఇవాళ(సోమవారం) ఏపీ సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో లోకేష్ పాల్గొని మాట్లా డారు. ఐదేళ్ల పరిపాలనలో అప్పుల రాష్ట్రంగా మార్చారని మంత్రి నారా లోకేష్ మండిపడ్డారు. మొన్నటి ఎన్నికల్లో నిజంగా గెలిచింది రాష్ట్ర ప్రజలేనని తెలిపారు. వైసీపీ హయాంలో ఒక్క పరిశ్రమ కూడా రాలేదని చెప్పారు. వైసీపీ నేతలు ప్రజాసమస్యలను పట్టిం చుకోలేదని అన్నారు. గతంలో ప్రశ్నిస్తే లాఠీ దెబ్బలు, అరెస్టులు, వేధింపులు ఉండేవని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలు సుఖశాంతులతో ఉన్నారని చెప్పారు. నియంత పాలన నుంచి ప్రజలకు నిజమైన స్వేచ్ఛ వచ్చిందని తెలిపారు. ఏ రాష్ట్రం ఇవ్వని విధంగా ఎక్కువ మొత్తం పింఛన్లను తాము ఇస్తున్నామని చెప్పారు. తల్లికి వందనం పేరుతో ఒకటో క్లాస్ నుంచి ఇంటర్ వరకు సాయం చేశామని తెలిపారు. ఇంకా చేయాల్సిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చాలా ఉన్నాయని ఒక్కొక్కటీ వరుసగా చేసుకుంటూ పోతున్నామని వివరించారు. అన్న క్యాంటీన్లు, ఉచిత గ్యాస్ అమలు చేస్తున్నామని వెల్లడించారు. మెగా డీఎస్సీ ద్వారా 16 వేల 347 పోస్టుల భర్తీ చేశామని ప్రకటించారు. భూములను కొట్టేయడానికి జగన్ తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేశామని గుర్తుచేశారు. పవన్ కల్యాణ్ నాయకత్వంలో పంచాయతీలకు మంచి రోజులు వచ్చాయని చెప్పారు మంత్రి నారా లోకేష్. పొగాకు, మామిడి, మిర్చి రైతుల సమస్యలపై యుద్ధప్రాతిపదికన స్పందించామని మంత్రి నారా లోకేష్ అన్నారు. సీమలో హార్టికల్చర్, రెన్యువబుల్ ఎనర్జీ హబ్‌లు వచ్చాయని గుర్తు చేశారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తో అన్ని పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు



వస్తున్నాయని తెలిపారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు కేంద్రం సహకరిస్తోందని చెప్పుకొచ్చారు. రాజకీయాలకు అతీతంగా విద్యాశాఖ ఉండాలని సూచించారు. గతంలో పుస్తకాల దగ్గర నుంచి అన్నింటిపైనా జగన్ బొమ్మలు ఉండేవని ఎద్దేవా చేశారు. రంగుల పిచ్చితో మొత్తం విద్యావ్యవస్థను నాశనం చేశారని ఫైర్ అయ్యారు. తాము అధికారంలోకి వచ్చాక విద్యార్థులకు సన్న బియ్యం పెడుతున్నామని తెలిపారు. చిక్కీల దగ్గర నుంచి పుస్తకాల వరకు ఎక్కడా తమ ఫొటోలు లేవని స్పష్టం చేశారు. 9,800 పాఠశాలల్లో వన్ క్లాస్ వన్ టీచర్ విధానం తీసుకు వచ్చామని తెలిపారు. ఉద్యోగుల కోసం జీవో 117 రద్దు చేశామని పేర్కొన్నారు మంత్రి నారా లోకేష్. ఏడాది పాలనలో అన్నీ సాధించామని తాము కాలర్ ఎగరేసి తిరగట్లేదని మంత్రి నారా లోకేష్ చెప్పారు. ఇంకా చేయాల్సింది ఎంతో ఉందనే పట్టుదలతోనే ముందుకు వెళ్తున్నామని అన్నారు. ఏడాది పాలనలో ఏం చేశారని ప్రశ్నించే వారికి మెజారిటీ హామీలు అమలు చేసి చూపామని గర్వంగా చెప్పగలమని.. ప్రజల్లో చిరునవ్వు తీసుకొచ్చామని చెప్పారు. జూన్ 4వ తేదీ ప్రజలు విజయం సాధించి ఏపీ చరిత్ర తిరగరాసిన రోజు అని గుర్తు చేశారు. గత ఐదేళ్ల విధ్వంస పాలనకు విముక్తి కలిగిన రోజు అని తెలిపారు. అభివృద్ధి వికేంద్రీకరణ చేస్తూ అన్ని ప్రాంతాల సమాన అభివృద్ధికి కృషి చేస్తున్నామని వెల్లడించారు మంత్రి నారా లోకేష్. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ పరుగులు పెడుతోందని మంత్రి నారా లోకేష్ ఉద్ఘాటించారు. ఐదేళ్లలో సాధించలేనిది ఏడాదిలోనే సాధించి చూపామని అన్నారు. ఉద్యోగులే ప్రభుత్వానికి గుండెకాయ అని అభివర్ణించారు. ప్రజలకు చేరువగా వెళ్లి సేవలందించాలని కోరారు. దేవుడు కూడా అన్ని సమస్యలు తీర్చలేరని చెప్పారు. అవకాశం ఉన్నంత వరకూ ప్రజా సమస్యలు పరిష్కరిస్తున్నామని తెలిపారు. గత జగన్ ప్రభుత్వం పెట్టిపోయిన బకాయిలను కూడా త్వరగా చెల్లిస్తున్నామని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.

# పేదలకు ఇచ్చిన డిఫామ్ పట్టాలకు రిజిష్ట్రేషన్ కల్పించాలి




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ప్రజలకు అందించే డిఫామ్ పట్టాలకు రిజిస్ట్రేషన్లను కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్.మున్నా కోరారు. స్థానిక సంతపేట సిపిఐ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలోని బాలాజీ నగర్, తదితర ప్రాంతాలలో డిఫామ్ పట్టాలకు రిజిస్ట్రేషన్లు ప్రభుత్వం నిలుపుదల చేసిందని ఆరోపించారు. దాంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేదల నివసించే డిఫామ్ పట్టాల నివాసాలకు, ప్రభుత్వం ఉచితంగా రిజిస్ట్రేషన్ లను చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నో సంవత్సరాల నుంచి పేద ప్రజలు నివాసాలు ఉండేందుకు, పట్టాలను ప్రజలకు పంపిణీ చేస్తున్నారని గుర్తు చేశారు. ఆ పట్టాల హక్కుదారులు రిజిస్ట్రేషన్ చేసుకునేలా ప్రభుత్వం ఏర్పాటు చేయాలని కోరారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేసేలా నిరుద్యోగ భృతిని నిరుద్యోగులకు వర్తింపజేయాలని కోరారు. ముఖ్యంగా డిఫామ్ పట్టాలకు రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాలని, లేని పక్షంలో ఈనెల 23న నెల్లూరు విచ్చే స్తున్న సీఎం కార్యక్రమాన్ని ముట్టడిస్తామని తెలిపారు. ఈ సమా వేశంలో షేక్.సర్దార్, వాసుదేవ రెడ్డి, అహ్మద్, మీరా, కరీముల్లా, షానవాజ్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ చైతన్య స్కూల్ పై చర్యలు తీసుకోవాలి

## - ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు డిమాండ్

**గూడూరు, (రాజధాని వార్తలు):** రాష్ట్ర వ్యాప్తంగా విద్య పేరుతో వ్యాపారం చేస్తున్న శ్రీ చైతన్య విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని గూడూరు నియోజకవర్గం కోట శ్రీ చైతన్య స్కూల్ వద్ద ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి శశి కుమార్, నియోజకవర్గ కార్యదర్శి యశ్వంత్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా శ్రీ చైతన్య విద్యాసంస్థలు విద్యను వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. అదేవిధంగా స్కూల్లోనే యూనిఫాం, బుక్స్, తదితర విద్యార్థులు కావాల్సిన వస్తువులను స్కూళ్లలోనే కొనుగోలు చేయాలంటూ ఆదేశాలిస్తూ వ్యాపారం చేస్తూ ఉన్నారన్నారు. టెక్నో, ఐఐటి, ఒలంపియా వంటి పేరుతో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా స్కూల్స్ నడుపుతున్నారన్నారు. విద్యార్థుల చదువు పేరుతో మానసిక ఒత్తిడికి గురి చేస్తూ అనేక రకాల ఇబ్బందులు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా వాహనాలను నడుపుతున్నారు. శ్రీ చైతన్య విద్యాసంస్థల్లో ఇంత జరుగుతున్నా విద్యాశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా పట్టించుకోకుండా వ్యవహరించడం చాలా దారుణం అని అన్నారు. భవిష్యత్తులో శ్రీ చైతన్య స్కూల్‌పై చర్యలు తీసుకోకపోతే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలో నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు ప్రణయ్, మోహితు, అభిలాష్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.




# హరిబాబు కుమార్తె చదువుకు రాజనేని ట్రస్ట్ ఆర్థిక సాయం

**గూడూరు, (రాజధాని వార్తలు):** గూడూరు రెండవ పట్టణం గాంధీనగర్‌కు చెందిన నాగిశెట్టి హరిబాబు కుమార్తె చదువుకు రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సాయం అందిం చింది. కిడ్నీ వ్యాధిగ్రస్తుడు నాగిశెట్టి హరిబాబుకు రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు రాజనేని శ్రీనివాసులు నాయుడు వైద్యం కోసం అనేకమార్లు నగదును అందించారు. ఇటీవల హరిబాబు మరణించడంతో అతని కుమార్తె తోషితను చదివించే బాధ్యత ట్రస్ట్ తీసుకుంది. అందులో భాగంగా శనివారం ట్రస్ట్ సభ్యులు ప్రజేంద్రారెడ్డి ద్వారా 10 వేల రూపాయల నగదును పాప చదువు కోసం తల్లి మనీషాకు అందజేయడం జరిగింది. ఇలాంటి పేదవారికి ఎందరికో విద్య, వైద్యంలో ఆర్థిక సాయం అందించే రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు రాజనేని శ్రీనివాసులు నాయుడుకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు.



# ఇంటికో చెట్టు నాటండి.. పర్యావరణాన్ని కాపాడండి : చైర్ పర్సన్ మోర్ల సుప్రజా మురళి






**బుచ్చిరెడ్డిపాలెం, (రాజధాని వార్తలు):** వాతావరణ కాలుష్యంలో నుంచి బయట పడాలంటే చెట్లు నాటడమే ఏకైక పరిష్కారం, ఇంటికో చెట్టు నాటండి పర్యావరణాన్ని కాపాడండి చైర్ పర్సన్ మోర్ల సుప్రజా మురళి పేర్కొన్నారు. ఈ సందర్భంగా శనివారం ఆమె మాట్లాడుతూ ఇళ్లల్లో చెత్తను వీధుల్లో వేయవద్దు,అపరిశుభ్ర వాతావరణమే అనారోగ్య సమస్యలకు కారణం అని తెలిపారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ సిబ్బందితో సహకరించాలని ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బుచ్చిరెడ్డి పాళెం పట్టణంలోని 19వ వార్డులో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పచ్చదనం పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఈ సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించారు. పచ్చదనం యొక్క ప్రాధాన్యతను వివరిస్తూ 19 వ వార్డు పరిధిలో చెట్లు నాటారు. అనంతరం బుచ్చిరెడ్డి పాళెం పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని కోరుతూ ఆమె ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మోర్ల సుప్రజ మురళి ఇంటికో చెట్టు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు. కలుషితమైన వాతావరణంలో నుంచి స్వచ్ఛమైన ఆక్సిజన్ లభించాలంటే చెట్లు నాటి పచ్చదనం పెంచడమే ఏకైక పరిష్కారం అన్నారు. ఇళ్లలోని చెత్తా చెదారాలు ఇతర వ్యర్థ పదార్థాలను వీధుల్లో కాలువల్లో వేసి అపరిశుభ్రంగా మార్చవద్దని ఆమె పట్టణ ప్రజలకు హితవు పలికారు. కాలువల్లో చెత్త చదరాలు వేయడం ద్వారా మురుగునీటి ప్రవాహానికి అంతరాయం ఏర్పడి దోమలు పెరిగేందుకు దోహదం చేస్తుందన్నారు. తద్వారా ప్రజలు డెంగ్యూ మలేరియాలాంటి జ్వరాల పడుతున్నారని తెలిపారు. ఇళ్లలోని వ్యర్థ పదార్థాలను డస్ట్ బిన్లలో వేసి పారిశుద్ధ కార్మికులతో సహకరించాలని ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డి బాలకృష్ణ, వైస్ చైర్మన్ ఎరటపల్లి శివకుమార్ రెడ్డి, కౌన్సిలర్లు కోటంరెడ్డి లలితమ్మ, తాళ్ల వైష్ణవి, రాచూరి సత్యం, పుట్ట లక్ష్మీకాంతమ్మ, ఏఇ పూజిత, వెంకటేష్, మెప్మా సీఈఓ నర్మద, తెలుగుదేశం పార్టీ నాయకులు కోటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, శివ తదితరులు పాల్గొన్నారు.



# పరిశుభ్రత పాటించండి : కోవూరు తహసీల్దార్ సుబ్బయ్య



**కోవూరు, (రాజధాని వార్తలు):** వారి వారి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోవూరు తహసీల్దార్ సుబ్బయ్య అన్నారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా తాసిల్దార్ సుబ్బయ్య డిటి బషీర్ సార్ సీనియర్ అసిస్టెంట్ రమణయ్యలు సిబ్బందులు పాల్గొని పిచ్చి మొక్కలను శుభ్రం చేసి చెత్త చెదారంను క్లీన్ చెయ్యడం జరిగింది. ఇదే కార్యక్రమంలో పెన్నా డెల్టా చైర్మెన్ గోపి రెడ్డి, స్థానిక నాయకులు స్వచ్ఛ భారత్‌లో పాల్గొన్నారు.

# బాషా యూత్ ఫౌండేషన్, దాతృత్వములో అన్నదానం





**విడవలూరు , (రాజధాని వార్తలు):** రామతీర్థంలో జరుగుచున్న రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎడ్ల పందాలను గౌడ సంఘం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాషా యూత్ ఫౌండేషన్ చైర్మెన్ వనమాల జనార్ధన్ రావు దాత్రుత్వములో భారీ అన్నదానకార్యక్రమం నిర్వహించారు. ఎడ్ల పోటీలకు చూసేందుకు వచ్చిన వారికీ భోజన సౌకర్యం కలిగించాలనే సేవతోనే అన్నదానం చేశామని వనమాల జనార్ధన్ రావు అన్నారు. ఈ కార్యక్రమంలో రామలింగేశ్వర స్వామి ఆలయ ఉత్సవ కమిటీ చైర్మెన్ అత్తిరాల సురేష్ నాయకత్వంలో గౌడ్ సంఘం ఎడ్ల పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక గౌడ్ సంఘ నాయకులు, తంబి నాగేశ్వరావు, సుదీర్, రామ తీర్థం గౌడ సంఘ పెద్దలు యువత తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా బార్ కౌన్సిల్ చైర్మన్‌గా పులిమి అయ్యప్ప రెడ్డి

**సంగం, (రాజధాని వార్తలు):** నెల్లూరు జిల్లా బార్ కౌన్సిల్ చైర్మన్‌గా పులిమి అయ్యప్ప రెడ్డి గెలుపొందారు. ఈ సందర్భంగా ఆయన అనుముసముద్రంపేటకు చెందిన పులిమి.అయ్యప్ప రెడ్డి,నెల్లూరు జిల్లా కేంద్రంలో మూడు ప్యానల్స్‌లకు రాత్రి జరిగిన ఎన్నికల్లో ఆయన 126 ఓట్లతో గెలుపొందారు. 20 ఏళ్లుగా లాయర్ వృత్తిలో ఉన్న వీరు 8 ఏళ్లు ప్రభుత్వ లాయర్ (పి పి)గా పని చేసిన అనుభవం ఉంది. మూడు ప్యానెల్‌లకు జరిగిన ఎన్నికల్లో అయ్యప్పరెడ్డి ప్యానెల్ విజయం సాధించడంతో వారి వర్గం ఆనందంతో విజయోత్సవాలు నిర్వహించారు. తోటి లాయర్లు ఆయన్ని అభినందించారు.



# అధికారుల తిరుపతి విద్యార్థుల తల్లిదండ్రుల ఆగ్రహం

## - మోడల్ స్కూల్ పేరుతో చిన్న పిల్లల్ని కిలోమీటర్ల దూరం నడిపిస్తారా అంటూ మండిపాటు - పెదపేట పాఠశాలకు తాళాలు వేసి నిరసన తెలిపిన పేరెంట్స్



**అమలాపురం, (రాజధాని వార్తలు):** మోడల్ స్కూల్ పేరుతో విద్యార్థులను కిలోమీటర్ల దూరంలో ఉన్న మరో పాఠశాలకు పంపడం ఎం తవరకు సమంజసం అంటూ విద్యార్థుల తల్లిదం డ్రులు పాఠశాలకు తాళాలు వేసి తమ నిరసన వ్యక్తం చేశారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం ఎస్ యానం పెద పేట (అంబేద్కర్ నగర్)లో ఉన్న ప్రాథమిక పాఠశాలలో 20 మంది విద్యార్థులు ఒకటవ తరగతి నుండి 5వ తరగతి వరకు విద్యనభ్యసిస్తున్నారు. ఇందులో మూడు, నాలుగు,ఐదు తరగతుల విద్యార్థులను మోడల్ స్కూల్ పేరుతో రెండు కిలోమీటర్ల దూరం ఉన్న శ్రీరామ నగర్ స్కూల్‌కు వెళ్ళమనడం ఎంతవరకు సమంజసమెంటు ఆవేదన వ్యక్తం శ్రీరామ్ నగర్ స్కూల్‌ను మోడల్ స్కూల్ అప్ గ్రేడ్ చేసామని చెప్పి దాదాపు పది మంది విద్యార్థులను మోడల్ స్కూల్‌కి వెళ్లాలని విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులందరూ ఆ మోడల్ స్కూల్ కి నడిచి వెళ్లాల్సి వస్తుందని గ్రామీణ ప్రాంతం కావడంతో దారిలో నిరంతరం రోడ్లపై పశువులు, వీధి కుక్కలు తిష్ట వేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న సందర్భంలో చిన్నపిల్లలు రెండు కిలోమీటర్ల మేర ఎలా నడిచి వెళ్తారని తల్లిదండ్రులు ఆగ్రహించి పెద్దపేట పాఠశాలకు శనివారం తాళాలు వేసి నిరసన వ్యక్తం చేశారు. విద్యాశాఖ అధికారులకు మొరపెట్టుకున్నప్పటికీ ఫలితం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తున్న తమ పిల్లలకు భద్రత కావాలని తల్లిదండ్రులతో కనీసం చర్చించకుండా రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న స్కూలుకు విద్యార్థులను ఎలా మారుస్తారని వారు ప్రశ్నించారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి మూడు, నాలుగు, ఐదు తరగతు లను పెదపేట పాఠశాలలోనే కొనసాగించి తమ పిల్లల విద్యాభివృద్ధికి సహకరించి భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని స్థానిక శాసనసభ్యులు, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్తామని తెలిపారు.

# చిరు-అనిల్ మూవీ... అక్టోబర్‌కే అంతా అయ్యేనా?




మెగాస్టార్ చిరంజీవి, అనిల్ రావిపూడి కాంబోలో రూపొందుతున్న సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. 2026 సంక్రాంతికి సినిమా విడుదల కాబోతున్న విషయం తెల్సిందే. దర్శకుడు అనిల్ రావిపూడి ఏదైనా తేదీ అనుకుంటే ఆ తేదీకి వచ్చి తీరుతాడు. 2025 సంక్రాంతికి తన సంక్రాంతికి వస్తున్నాం సినిమాను విడుదల చేయాలని పట్టుబట్టాడు. దిల్ రాజుపై ఒత్తిడి తెచ్చి మరీ అదే తేదీకి తీసుకు వచ్చాడు. ఆయన అనుకున్నాడు అంటే కచ్చితంగా ఆ తేదీకి తీసుకు వస్తాడు అనే టాక్ పడింది. అందుకే చిరంజీవితో చేస్తున్న సినిమాను 2026 సంక్రాంతికి తీసుకు వస్తాడా లేదా అనే అనుమానం లేనే లేదు. ఎందుకంటే సినిమా షూటింగ్ చకచక జరుగుతోంది. ఇప్పటికే రెండు షెడ్యూల్స్ పూర్తి చేసుకుంది. ఇటీవలే రెండో షెడ్యూల్‌ను ముస్సోరీలో పూర్తి చేసిన అనిల్ రావిపూడి మూడో షెడ్యూల్‌కి ఏర్పాట్లు పూర్తి చేశాడు. మూడో షెడ్యూల్ షూటింగ్ ప్రారంభంకు సంబంధించిన ఆసక్తికర అప్‌డేట్ చిత్ర యూనిట్ సభ్యుల నుంచి వినిపిస్తుంది. మూడో షెడ్యూల్‌ను హైదరాబాద్‌లో ప్లాన్ చేశారు. ఈ షెడ్యూల్‌లో చిరంజీవి, నయనతార పాల్గొనబోతున్నారు. వీరిద్దరితో పాటు వెంకటేష్ సైతం ఈ షెడ్యూల్‌లో పాల్గొంటాడని తెలుస్తోంది. విశ్వసనీయంగా అందుతున్న సమాచారం ప్రకారం చిరు-అనిల్ రావిపూడి సినిమా కోసం వెంకటేష్ ఏకంగా మూడు నుంచి నాలుగు వారాల డేట్లు ఇచ్చాడని తెలుస్తోంది. ఒకే షెడ్యూల్‌లో వెంకటేష్‌కి సంబంధించిన షూటింగ్ కార్యక్రమాలు పూర్తి చేస్తారు. దాదాపుగా నాలుగు వారాల డేట్లు వెంకటేష్ ఇచ్చాడనే వార్తలు వస్తున్న నేపథ్యంలో కచ్చితంగా ఆయన పాత్ర తక్కువేం ఉండదని అనిపిస్తుంది. మూడో షెడ్యూల్ ను జులై చివరి వరకు చేసే అవకాశాలు ఉన్నాయి. మూడో షెడ్యూల్‌తో సినిమాకు సంబంధించిన కీలక టాకీ పార్ట్ పూర్తి అవుతుందని మేకర్స్ చెబుతున్నారు. అనిల్ రావిపూడి జోరు చూస్తూ ఉంటే ఈ సినిమా షూటింగ్‌ను అక్టోబర్ వరకు పూర్తి చేసే అవకాశాలు ఉన్నాయి. నవంబర్, డిసెంబర్ మొత్తం కూడా ప్రమోషన్‌కి సమయం కేటాయించే అవకాశాలు ఉన్నాయి. అదే జరిగితే కచ్చితంగా ప్రమోషన్ కంటెంట్ అద్భుతంగా వచ్చే అవకాశాలు ఉన్నాయి, తద్వార సినిమాను జనాల్లోకి ఎక్కువగా తీసుకు వెళ్లే అవకాశాలు ఉన్నాయని సినీ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. చిరంజీవి ఈ ఏడాదిలో వశిష్ట దర్శకత్వంలో నటించిన విశ్వంభర సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. భారీ సోషియో ఫాంటసీ సినిమాగా రూపొందిన ఈ సినిమాకు సంబంధించిన వీఎఫ్ఎక్స్ వర్క్ జరుగుతోంది. ఆ సినిమాను విడుదల చేసిన వెంటనే అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందుతున్న సినిమాతో రాబోతున్నాడు. ఈ సినిమాలో నయనతార హీరోయిన్‌గా నటిస్తున్న కారణంగా ఇతర భాషల్లో విడుదల అయ్యేనా చూడాలి. చిరంజీవి వింటేజ్ లుక్‌తో పాటు, వింటేజ్ కామెడీని ఈ సినిమాలో చూస్తారు అంటూ అభిమానులకు అనిల్ రావిపూడి హామీ ఇస్తున్నాడు. మరి ఆయన అన్నట్లుగా ఈ సినిమా ఉంటుందా అనేది తెలియాలంటే 2026 సంక్రాంతి వరకు వెయిట్ చేయాల్సిందే.

# అలాంటి సినిమాలకు రష్మిక లక్కీ ఛార్మ్



శేఖర్ కమ్ముల దర్శకత్వంలో వచ్చిన కుబేర సినిమా హిట్ అవడంతో రష్మిక మళ్లీ సక్సెస్ ట్రాక్‌లోకి వచ్చింది. గత శుక్రవారం రిలీజైన ఈ సినిమాకు ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వస్తోంది. రష్మిక నుంచి వచ్చిన ఆఖరిగా వచ్చిన సినిమా సికందర్. సల్మాన్ ఖాన్ సరసన రష్మిక నటించిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్‌గా నిలవగా, ఇప్పుడు మళ్లీ కుబేర సినిమాతో రష్మిక మంచి హిట్‌ను అందుకుంది. యానిమల్, పుష్ప2, ఛావా సినిమాల సక్సెస్ తర్వాత కుబేర సినిమాకు రష్మిక అద్భుతమైన రెస్పాన్స్‌ను అందుకుని, తన విజయాల పరంపరను కొనసాగిస్తోంది. కుబేర సినిమాలో ధనుష్, నాగార్జున పాత్రలకు వచ్చినంత రెస్పాన్స్ రష్మిక పాత్రకు రాకపోయినా, సమీరాగా రష్మిక ఎంతో ఒద్దికగా, చాలా సెటిల్డ్ పెర్ఫార్మెన్స్ ఇచ్చి అందరి మన్ననలను పొందుతుంది. కుబేర సినిమాలో డంప్ యార్డ్ సీన్‌లో మాత్రం రష్మిక నటన అందరినీ ఆకట్టుకుంది.

కుబేర సినిమా సక్సెస్ తర్వాత రష్మికను పాన్ ఇండియన్ సినిమాలకు లక్కీ చార్మ్‌గా తన ఇమేజ్‌ను నిలబెట్టుకుందని నెటిజన్లు చెప్తున్నారు. రష్మిక మందన్నా గత రెండు కోలీవుడ్ సినిమాలు సుల్తాన్, వరిసు ఓ మోస్తరు వసూళ్లనే రాబట్టుకున్నాయి. కుబేర కూడా తమిళంలో యావరేజ్ బిజినెస్‌ను మాత్రమే చేస్తోంది. అయితే ఈ సినిమా సక్సెస్ రష్మికకు కోలీవుడ్‌లో కొత్త మార్కెట్‌ను తెచ్చిపెట్టే అవకాశాలున్నాయి. ప్రస్తుతం రష్మిక మందన్నా నాలుగు ప్రాజెక్టుల్లో హీరోయిన్‌గా నటిస్తుండగా అందులో ది గర్ల్‌ఫ్రెండ్, రెయిన్‌బో అనే తెలుగు సినిమాలతో పాటూ థామా, కాక్‌టెయిల్2 అనే రెండు బాలీవుడ్ సినిమాలు కూడా ఉన్నాయి. సినిమా రిజల్ట్‌తో సంబంధం లేకుండా సినిమా సినిమాకీ తన క్రేజ్ ను విపరీతంగా పెంచుకుంటూ పోతున్న రష్మిక ప్రస్తుతం చేస్తున్న సినిమాలతో ఎలాంటి ఫలితాలను అందుకుంటుందో చూడాలి.

# మాళవిక దర్శకురాలు అవ్వాలనుకుందా!



కేరళ కుట్టి మాళవిక మోహనన్ టాలీవుడ్‌లో ఇంకా లాంచ్ అవ్వడానికంటే ముందే ఫేమస్ అవుతోన్న సంగతి తెలిసిందే. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తోన్న రాజాసాబ్‌లో అమ్మడు మాంచి ఐటం పాటతో అలరించడానికి రెడీ అవుతోంది. ఈ సినిమా రిలీజ్ కుముందే మాళవిక టాలీవుడ్ ఆడియన్స్‌కు దగ్గరైంది. రిలీజ్ అయిన తర్వాత అమ్మడి ఫాలోయింగ్ రెట్టింపు అవ్వడం ఖాయం. ఇప్పటికే అమ్మడు నెట్టింట ఓ సంచలనం. హాట్ ఫోటోలతో కుర్రకారులో గుబులు పుట్టిస్తుంది. మతిపోయే భంగిమలతో సెగలు రేపుతుంది. కేరళ అందాలు ఎలివేషన్ విషయంలో మిగతా భామలు వెనుకా? ముందు ఆలోచిస్తారేమో గానీ మాళవిక మాత్రం అలాంటి ఆలోచనలేవి దరి చేరనీయకుండా చేలరేగుతుంది. అందుకే కేరళ భామలందు ఈ భామ సంథింగ్ స్పెషల్. అయితే ఈ బ్యూటీ నటి అవ్వడం అన్నది అనుకోకుండా జరిగిందని తెలిపింది. కెమెరా ముందుకు రావడం కంటే కెమెరా వెనుక ఉండే పనిచేయడం తనకి ఎక్కువ ఆసక్తి అని అంటోంది. అన్ని అనుకున్నట్లు జరిగితే తాను దర్శకురాలినో, ఛాయాగ్రాహకురాలో అయ్యేదాన్ని అని, కానీ కాలం తనని నటిగా పరిచయం చేసిందంది. ఓదశలో ఎడిటింగ్ కూడా నేర్చుకుందిట. ఆ విభాగంలో స్థిరపడాలనే ఆలోచన కూడా ఉండేదని తెలిపింది. మాళవిక తండ్రి కె.యూ మోహనన్ ప్రముఖా చాయాగ్రాహకుడు. మాలీవుడ్‌లో ఎన్నో సినిమాలకు పని చేసారు. సీనియర్ టెక్నిషియన్‌గా ఆయనకు మంచి పేరుంది. ఈ నేపథ్యంలో తనయ కూడా తండ్రి అడుగు జాడల్లోనే కెమెరా ఉమెన్ అవ్వాలనుకుంది. కానీ నటిగా అందాలతో అలరిస్తుంది. ప్రస్తుతం తమిళ్, మలయాళంలో ఎక్కువ సినిమాలు చేస్తోంది.

# అమీర్ ఖాన్.. ఈసారి హిట్టు కొట్టినట్లేనా?



3 ఇడియట్స్ - పీకే - దంగల్ లాంటి సినిమాలతో బాక్సాఫీస్ వద్ద ఒక ట్రెండ్ సెట్ చేసిన అమీర్ ఖాన్ ఈమధ్య కాలంలో కొన్ని ఊహించని డిజాస్టర్స్‌ను ఎదుర్కొన్నాడు. సౌత్ సినిమాల డామినేషన్‌తో ఖాన్ త్రయం సందిగ్ధంలో పడగా ఎక్కువ ప్రభావం మిస్టర్ పర్ఫెక్ట్ మీదే పడింది. అయినప్పటికీ సేఫ్ గేమ్ ఆడకుండా ప్రయోగాత్మక కథలపైనే ఫోకస్ పెట్టాడు అమీర్‌ఖాన్. ఇప్పుడు ఉన్న బాలీవుడ్ హీరోల్లో తన సినిమాలతో సామాజికమైన అంశాలపై చర్చను తెచ్చే స్టైలే అమీర్ ఖాన్‌ది. లాల్ సింగ్ చద్దా డిజాస్టర్ తర్వాత మళ్లీ రీమేక్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రావడం అనేకమందిని ఆశ్చర్యపరిచింది. 'సితారే జమీన్ పర్' అనే ఎమోషనల్ డ్రామాతో అందరినీ ఆలోచనలో పడేసాడు. హాలీవుడ్ చిత్రం 'చాంపియన్స్' ఆధారంగా రూపొందిన ఈ సినిమా, పిల్లలపై, వారి మానసిక స్థితిపై ఫోకస్ చేస్తూ తనదైన శైలిలో అమీర్ మళ్లీ స్క్రీన్ మీద మెరిశాడు. ఈ సినిమాపై మొదటి రెండు రోజులు పెద్దగా అంచనాలు లేకపోయినా, ఇప్పుడు క్రమంగా వేగం పెంచుతోంది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, విడుదలైన మూడు రోజుల్లోనే ఈ సినిమా దాదాపు 60 కోట్లు వసూలు చేసింది. ఆదివారం ప్రత్యేకంగా మంచి గ్రోత్ కనిపించింది. మహేష్ బాబు వంటి సౌత్ స్టార్లు ఈ సినిమాపై సోషల్ మీడియాలో సపోర్ట్ తెలపడంతో పాజిటివ్ వేవ్ మరింత పెరిగింది. మంచి కంటెంట్ ఉన్న సినిమా అనే అభిప్రాయం జనం మధ్య విస్తరిస్తోంది. ఈ సినిమాకు పెద్ద రేంజ్ బ్లాక్‌బస్టర్ స్థాయి టాక్ రాకపోయినా, ఓ ఫ్యామిలీ డ్రామాగా నిలవగలదని ట్రేడ్ విశ్లేషకులు చెబుతున్నారు. బాలీవుడ్‌లో ఇప్పట్లో పెద్ద రిలీజ్‌లు లేకపోవడంతో హిందీ ఆడియన్స్‌కు ఇది బెస్ట్ ఆప్షన్‌గా మారుతోంది. కుబేర హిందీలో పెద్దగా క్లిక్ కాకపోవడంతో అమీర్ సినిమా స్థిరమైన చోటు దక్కించుకుంటోంది. తారే జమీన్ పర్, చక్ దే ఇండియా వంటి భావోద్వేగ చిత్రాల మిక్స్‌లా ఉండడంతో ఫ్యామిలీస్ అట్రాక్ట్ అవుతున్నారు. ఇక ఓటీటీ విషయానికి వస్తే, ఇప్పటికే కొన్ని సంస్థలు 100 కోట్లకు పైగా ఆఫర్ చేసినా అమీర్ ఖాన్ మాత్రం యూట్యూబ్ పేపర్ వ్యూ మోడల్‌నే ముందుగానే ప్లాన్ చేశాడని తెలుస్తోంది. థియేటర్లో మంచి వసూళ్లు వస్తే అమీర్ ఆ డిస్ట్రిబ్యూషన్ మోడల్‌నే ఫాలో కావచ్చు. ఒకవేళ ఇంకా కలెక్షన్లు బాగా పెరిగితే, ఓటీటీ డీల్స్‌పై మళ్లీ ఆలోచించవచ్చని ట్రేడ్ వర్గాలు అంటున్నాయి. ఇక తాజాగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం, దేశవ్యాప్తంగా కొన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రత్యేక షోలు వేసే ఆలోచనలో అమీర్ ఉన్నట్లు తెలుస్తోంది. ఇది జరిగితే మళ్లీ ఒక కొత్త మార్కెట్‌ను టార్గెట్ చేసినట్టే అవుతుంది.

# శ్రీ భోగలింగేశ్వర స్వామిని దర్శించుకున్న డిఆర్ఓ : చైర్మన్ సత్యనారాయణ



**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డిఆర్ఓగా పనిచేస్తున్న వైఎస్ వి కే జి ఎస్ ఎల్ సత్యనారాయణరావు దంపతులు జ్యేష్ట మాస శివరాత్రి పురస్కరించుకొని శ్రీశ్రీశ్రీ భోగలింగేశ్వర దేవస్థానం దర్శనార్థం విచ్చేశారని దేవస్థాన చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ తెలియజేశారు. వీరికి పాలక మండల సభ్యులు పెంటకోట గణేష్ మల్ల సూరిబాబు యల మంచిలి బంగారు రాజు కొత్ర హరి భక్తులు వామాల చంద్రశేఖర్ బుద్ధ మురళి తాతారావు మల్ల గణేష్ దేవస్థాన సిబ్బంది అర్చక స్వాములు పూర్ణకుంభం స్వాగతం పలికి స్వామివారి పూజ కార్యక్రమాలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించిన అనంతరం మండపంలో అర్చక స్వాములు పేరూరు చిన్న స్వామి సాత్విక్ శర్మ పేరూరి సూర్యనారాయణ పేరూరి పరమేశ్వరరావు పేరూరు వేణు గోపాల్ పేరూరు హరనాథ్ తదితరులు వీఆర్వో దంపతులను వేదమంత్రోచ్ఛరణ చేసి అక్షింతలు వేసి ఆశీర్వదించారు.

# అనకాపల్లి జిల్లా ఎస్ టి ఓని కలిసిన విశ్రాంతి ఉద్యోగులు

**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** అనకాపల్లి జిల్లాకు పశ్చిమ ట్రెజరీ కార్యాలయానికి సబ్ ట్రెజరీ ఆఫీసర్గా నూతనంగా నియామకమైన వివి జోగారావును మర్యాదపూర్వకంగా రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి బుద్ధ కాశీ విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో కలుసుకొని జాగారావును శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా దీర్ఘకాలికంగా కొన్ని సమస్యలను ఎస్ టి ఓ దృష్టికి పెన్షనర్స్ తీసుకువెళ్లారు. ప్రతినెల ఆరోగ్య భీమా చెల్లించే కొంతమంది పెన్షనర్ల భార్యాభర్తల ఇద్దరు పేరునా వసూలు చేస్తున్నారని తక్షణం భార్య పేరుతో ఉన్న బీమాను తొలగించవలసిందిగా ఎస్టిఓను కోరారు. అదేవిధంగా భార్యాభర్తలు ఉద్యోగస్తులు ఆయన సందర్భంలో ఒకరు పెన్షన్ తీసుకున్నవారు మరొక ఉద్యోగం చేస్తున్న వారు కనుక ఇద్దరు దగ్గర ఆరోగ్య భీమా వసూలు చేస్తున్నారని ఒక్కరికి మాత్రమే వసూలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, అలాగే భార్య ఉపాధ్యాయులుగా చేస్తున్న పే స్లిప్లో పుట్టిన తేదీ లేకపోవడం సమస్యలు వస్తున్నాయని, పెన్షనర్లకు యొక్క పేస్లిప్ లో డేట్ ఆఫ్ బర్త్ లేకపోవడం వల్ల క్వాంటం పెన్షన్ పొందేటప్పుడు



కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎస్ టి ఓకి సభ్యులు వివరించారు. ఏ చిన్న సమస్య ఉన్న నా దృష్టికి తీసుకువస్తే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాండ్రేగుల సత్యనారాయణ ఎస్ మన్మధరావు జోగారావు యల్లపు శ్రీరాములు కే చంటిబాబు కే సర్వేశ్వరరావు గణపతి శరగడం నూకరాజు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.





**శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా భారతీయ జనతా పార్టీ అటల్జీ మండలం 80 81, 84 వార్డులలో వర్ధంతి కార్యక్రమాలు జరిగినది. ఈ కార్యక్రమాలలో పాల్గొన్నవారు మారిశెట్టి భాస్కర్ రావు 80 డివిజన్ బిజెపి పార్టీ ఇంచార్జ్. అటల్జీ మండల అధ్యక్షులు కొమలపల్లి సన్యాసిరావు శక్తి కేంద్ర ప్రముఖులు మద్దాల నాగశివ రాపేట్ సంతోష్ బల్లెం నర్సింగరావు కర్రి పరదేశి నాయుడు పెద్దలు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.**



# అల్లూరి జిల్లాలో కళాకారుల సంఘం ఆవిర్భావం

## - చింతపల్లిలో ఘనంగా ప్రారంభమైన కార్యక్రమంలో నూతన కార్యవర్గం ఎన్నిక - అధ్యక్షుడు అశ్విన్, వర్కింగ్ ప్రెసిడెంట్ రవి





**అల్లూరి జిల్లా, చింతపల్లి, (రాజధాని వార్తలు):** అల్లూరి జిల్లాలో కళాకారుల ఐక్యతకు వేదికగా సేవలందించనున్న అల్లూరి జిల్లా కళాకారుల సంఘం సోమవారం చింతపల్లి కేంద్రంగా ప్రారంభమైంది. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రముఖ డ్యాన్స్ కళాకారులు, కొరియోగ్రాఫర్లు ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమావేశం నిర్వహించి, డ్యాన్స్ కళను సమాజంలో ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు సర్వసమ్మతంగా పలు తీర్మానాలు ఆమోదించారు. కళాకారుల హక్కులను పరిరక్షిస్తూ, వారి అభివృద్ధికి కృషి చేస్తామని నాయకత్వం స్పష్టం చేసింది. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా పల్టాసింగి అశ్విన్, ఉపాధ్యక్షుడిగా రాము, కార్యదర్శిగా చంటి, కోశాధికారిగా యేసు, సంయుక్త కార్యదర్శిగా నారి బాధ్యతలు చేపట్టనున్నారు. అలాగే, గౌరవ అధ్యక్షులుగా చిన్నా, రాజు, సురేష్ పట్నాయక్, అజయ్ సాయిలను నియమించారు. వర్కింగ్ ప్రెసిడెంట్గా మోరి రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కళల వికాసానికి, కళాకారుల అభ్యున్నతికి ఈ సంఘం మార్గదర్శకంగా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు. కొత్త కార్యవర్గం నాయకత్వంలో జిల్లా కళాకారుల ప్రతిభ ప్రదర్శించేందుకు, రాష్ట్ర స్థాయికి ఎదిగేందుకు ఆశాజనకమైన మార్గం ఏర్పడిందని వారు అన్నారు.

# వేడుకలు కూడా సమాజానికి ఉపాయోగపడేలా చూసుకోవాలి : లయన్ డా.పైడి.సింధూర





**శ్రీకాకుళం, (రాజధాని వార్తలు):** కొన్ని వేడుకలు కూడా సమాజానికి ఉపాయోగపడేలా ప్రతీ ఒక్కరూ బాధ్యత తీసుకుంటే, కొంతమంది నిస్సహాయకులకు అండగా నిలవచ్చని, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ నూతన అధ్యక్షురాలు లయన్ డా.పైడి.సింధూర సోమవారం అన్నారు. స్థానిక కెల్లా వీధికి చెందిన కొల్లి. రాము జన్మదినం సందర్భంగా నగరంలో పేదలకు అన్నవితరణ చేపట్టారు. ప్రముఖ వైద్యురాలు, సింధూర హాస్పిటల్ ఎండి లయన్ డా. పైడి సింధూర ముఖ్య అతిథిగా పాల్గొని, నైట్ షెల్టర్ నివాసకులకు అన్నప్రసాదాన్ని అందించి మాట్లాడుతూ నేటి దాత రాము, ఏసీ మెకానిక్గా పని చేస్తూ సామాజికసేవకు ముందుకు రావటం హర్షణీయమని, జన్మదిన, పెళ్లిరోజు వేడుకలతో పాటు ఇతరాత్ర వేడుకలను పేదల మధ్య జరుపుకొని, వారికి అవసరమైన చిన్న చిన్న అవసరాలను తీర్చే బాధ్యతను ప్రతీ ఒక్కరూ తీసుకుంటే, వారి అవసరాలు తీరటమే కాకుండా, ఒంటరిగా గడుపుతున్న వారి జీవితానికి మానమున్నామనే భావన కలుగుతుందని, తద్వారా ఇంకొన్ని రోజులు ఆనందంగా గడుపుతారన్నారు. ఇటీవలే షెల్టర్ బాధ్యతను చేపట్టిన చేయూత మేమున్నాం అధ్యక్షురాలు వైశ్యరాజు.వెంకటలక్ష్మి, ఇక్కడ ఉండే నిస్సహాయకులకు అండగా నిలుస్తూ, నగర సేవకుల సహకారంతో ముందుకు తీసుకెళుతుండటం మంచి తరుణమన్నారు. చేయూత మేమున్నాం అధ్యక్షురాలు వైశ్యరాజు.వెంకటలక్ష్మి మాట్లాడుతూ నేటి దాత కొల్లి. రాము, తన అన్నయ్య కొల్లి. శివను స్ఫూర్తిగా తీసుకొని ఈ రోజు కార్యక్రమం నిర్వహించారని, లయన్ నూతన ఉపాధ్యక్షులు ఉర్లం.శివతేజ పట్నాయక్, రెడ్ క్రాస్ ప్రతినిధి నంది. ఉమా శంకర్ అందిస్తున్న సహకారంతో ఇక్కడ కొన్ని సమస్యలు తీరుతున్నాయన్నారు. రానున్న రోజులలో అన్ని స్వచ్ఛంద సంస్థలను కలుపుకుంటూ, నైట్ షెల్టర్కు పూర్వవైభవం తీసుకు వస్తామని ఈ సందర్భంగా తెలిపారు.

ఈ కార్యక్రమంలో కొల్లి. రాము కుటుంబ సభ్యులు, అన్నయ్య కొల్లి. శివ, వదిన ఝూన్సి, స్నేహితులు సురేష్, విక్కీ, షరీఫ్, షెల్టర్ సేవకులు ఉర్లం. శివతేజ, నంది. ఉమా శంకర్, నైట్ షెల్టర్ నివాసకులు పాల్గొన్నారు.

# యోగా దినోత్సవం సందర్భంగా ఏకరూప దుస్తులు





**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** స్థానిక వుడ్ పేట హ్యాపీ కిడ్స్ ప్లే స్కూల్లో యోగా దినోత్సవం సందర్భంగా చిట్టిపొట్టి చిన్నారులంతా తెలుపు వర్ణ ఏకరూప దుస్తులు ధరించి కరస్పాండెంట్ శేశెట్టి గిరీష్ కుమార్ ఆధ్వర్యంలో యోగాసనాలను అభ్యసించారు. యోగ అనేది భారతదేశ పురాతన అభ్యాసమని, యోగా, ధ్యానం వలన శారీరక, మానసిక, ఆధ్యాత్మిక చైతన్యం కలుగుతుందని, ప్రతి రోజు యోగా సాధన ద్వారా శారీరకంగా, మానసికంగా ఉత్తమ ఫలితాలను పొందగలమని కరస్పాండెంట్ గిరీష్ కుమార్ చెట్టిపొట్టి చిన్నారులకు యోగ యొక్క విశిష్టతను విపులంగా వివరించారు. భారత గౌరవ ప్రధాని మోడీ ప్రతిపాదన మేరకు ఐక్యరాజ్యసమితి ఆమోదంతో ప్రపంచ యోగా దినోత్సవం ఉద్భవించిందని, ఆంధ్ర ముఖ్యమంత్రి గౌరవ చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో విశాఖ పట్నంలో యోగాంధ్ర పేరుతో నిర్వహించిన యోగ దినోత్సవం గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్లో చోటు దక్కించుకున్నందుకు కరస్పాండెంట్ గిరీష్ కుమార్, ప్రిన్సిపల్ సునీత శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బంది, విశ్రాంత ఏఈ మల్ల చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

# విద్యా మిత్ర కిట్స్ విద్యార్థులకు పంపిణీ





**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** అనకాపల్లి జిల్లా కశింకోట మండలం చింతలపాలెం గ్రామంలో సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర కిట్స్ విద్యార్థులకు పంపిణీ చేయటం జరిగింది ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు గొంతిని చిరంజీవి మాట్లాడుతూ మన కూటమి ప్రభుత్వం ప్రపంచం చరిత్రలోనే నిలిచిపోతుందని అలాగే మీ యొక్క తల్లి అకౌంట్లో తల్లికి వందనం డబ్బులు ఒక్కరు ఉంటే 13000 ఇద్దరు ఉంటే 26,000 ముగ్గురు ఉంటే 39,000 నలుగురు ఉంటే 52, 000 పడ్డాయని మధ్యాహ్న భోజనం కూడా సన్న బియ్యం అన్నం పెట్టడం చాలా సంతోషంగా ఉంది మన విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ బాబు స్కూల్ పైన ఎక్కువ శ్రద్ధ పెట్టారు కాబట్టి కూటమి ప్రభుత్వం విద్యార్థులకు మరెన్నో మంచి పనులు చేస్తుందని తెలియజేశారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కర్రి దురుగునాయుడు మండల తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి గంటా యువసేన కన్వీనర్ జెర్రిపోతుల నూకు నాయుడు వైస్ ప్రెసిడెంట్ బల్ల అప్పలకొండ కోన రమణ కోన అబ్బాయి నాయుడు గ్రామ తెలుగుదేశం పార్టీ



అధ్యక్షులు అధ్యక్షులు పులిమంతుల గణేష్ తెరపల్లి శ్రీను కాపుశెట్టి శివ స్కూల్ కమిటీ చైర్మన్ బోజా తాతాజీ మజ్జి బాలాజీ పోతిన అప్పలస్వామి నాయుడు బుదిరెడ్డి శంకర్రావు సోడా నాగరాజు స్కూల్ టీచర్స్ కూటమి నాయకులు పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan